# తొలి అక్షరం

చైర్మన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 23 పేజీలు - 6 మంగళవారం 17 డిసెంబర్ 2024


## గురుకులాల ఏర్పాటులో నిర్లక్ష్యం: ఎమ్మెల్సీ కవిత

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క బీసీ గురుకుల పాఠశాలను కూడా ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కనీసం గురుకులాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం19 బీసీ సంక్షేమ పాఠశాలలను మాత్రమే ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ పదేండ్లలో కేసీఆర్ 275 బీసీ పాఠశాలలను, 31 బీసీ డిగ్రీ కాలేజీలను, ప్రత్యేకంగా బీసీలకు రెండు వ్యవసాయ కాలేజీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.14వేల కోట్లు విడుదల చేసిందని చెప్పారు.

## ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ ప్రతిభతో 'తబలా వాయిద్యం విశ్వవ్యాప్తం'

- జాకీర్ హుస్సేన్‌కు ప్రధాని మోదీ సంతాపం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం తెలిపారు. భారత సంప్రదాయ సంగీతంలో విప్లవం తీసుకువచ్చిన ఓ జ్ఞానిగా ఉస్తాద్ జకీర్ హుస్సేన్‌ను గుర్తు చేసుకుంటామన్నారు. ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో స్పందిస్తూ.. లెజెండరీ మ్యాస్ట్రో జకీర్ హుస్సేన్ మృతి బాధకు గురి చేసిందన్నారు. తబలా వాయిద్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన సంగీత కళాకారుడు అని పేర్కొన్నారు. తన తబలా మ్యూజిక్‌తో లక్షలాది మంది అభిమానుల్ని ఆకట్టుకున్నట్లు చెప్పారు. భారతీయ క్లాసికల్ సంప్రదాయాలను.. గ్లోబల్ మ్యూజిక్ తో సమ్మిళితం చేసి.. సాంస్కృతిక ఐకమత్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. జాకీర్ హుస్సేన్ ఇచ్చిన ప్రదర్శనలు.. రసభరితమైన బాణీలు.. రాబోయే తరాలకు చెందిన మ్యూజిక్ లవర్స్‌ను ప్రేరేపిస్తూనే ఉంటాయన్నారు. జాకీర్ కుటుంబసభ్యులు, స్నేహితులు, ప్రపంచ సంగీత లోకానికి సంతాపం చెబుతున్నట్లు మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

# నేడు లోక్‌సభ ముందుకు జమిలి బిల్లు

- సభలో ప్రవేశ పెట్టనున్న న్యాయశాఖ మంత్రి
- అనంతరం జెపిసికి పంపేందుకు సిద్ధం




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,డిసెంబర్ 16:** దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబం ధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఒకే దేశం–ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించే జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. వాస్తవానికి రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల సవరణ బిల్లును సోమవారం సభలో ప్రవేశ పెట్టనున్నట్లు ముందుగా వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రివైజ్ చేసిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో వీటిని తొలగించారు. లోక్‌సభ కార్యదర్శి విడుదల చేసిన రివైజ్డ్ జాబితాలో సోమవారం ఈ రెండు బిల్లులకు సంబంధించిన అజెండాను పెట్టలేదు. దీంతో ఈ బిల్లులు నేడు

వివరాలు 2లో

# కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

- 31 లక్షల మందికి ప్రయోజనం
- శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ ప్రకటన



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** ప్రభుత్వ అంచనా ప్రకారం.. కొత్తగా పది లక్షల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉండవచ్చని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కూడా ఆధారం చేసుకుంటామన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీతో.. ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చెయ్యబోతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు.. మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేళ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు

వివరాలు 2లో



## జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

- ఉద్యోగాల ఖాళీల అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** తెలంగాణలో ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు జాబ్ కేలండర్ ఆధారంగా ఉంటాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగాల ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేప డుతున్నామని తెలిపారు. శాసన మండలిలో ఆయన మా ట్లాడారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్

వివరాలు 2లో

## హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- గతంల ఎన్నడూ లేనంతగా 7.1 డిగ్రీలుగా నమోదు



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపో యాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనం తంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్ సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీ లు, బీహెచ్ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చబొల్లారం

వివరాలు 2లో

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

- రుణాలపై తప్పులు నివేదిక సమర్పించిన కాంగ్రెస్
- రూ.3.89 లక్షల కోట్లు ఉందని ఆర్‌బీఐ చెబితే రూ.7 లక్షల చూపి తప్పుదోవ
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌పై తప్పుడు నివేదికలు వెల్లడించిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని "హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరుతో ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో నిరూపితమైందని కేటీఆర్ అన్నారు. 2014–15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్బీఐ నివేదికలో స్పష్టం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారమిచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారని అన్నారు. అందుకే తెలంగాణ శాసనసభ కార్య విధాన మరియు కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం తరపున ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న అంశంలోనూ సభా హక్కుల నోటీసులు ఇచ్చామని తెలిపారు. లగచర్ల వంటి బాధాకరమైన

వివరాలు 2లో

## వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటేయొద్దు : ఢిల్లీ సీఎం అతిషి



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,డిసెంబర్ 16:** వచ్చే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయొద్దని అక్కడి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అతిషి.. సల్వార్ కమీజ్, శాలువా, రూ.500 మీ ఐదేళ్ల అవసరాలను తీర్చలేవని ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు బీజేపీ ఇచ్చే వాటి కోసం ఆశపడొద్దని అతిషి సూచించారు. అర్వింద్ కేజ్రీవాల్ ఆలోచనల నుంచి వచ్చిన ఉచిత కరెంట్, ఉచిత తాగునీరు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మొహల్లా క్లినిక్‌లలో ఉచిత వైద్యం లాంటి మీ ఐదేళ్ల అవసరాలను తీర్చగలుగుతాయని చెప్పారు. ఢిల్లీలో పేదల కోసం పనిచేసే నాయకుడు అర్వింద్ కేజ్రీవాల్ ఒక్కరేనని అతిషి అన్నారు. కాబట్టి పేదలు బీజేపీ నాయకులతో చాలా జాగ్రత్తగా ఉండాలని అతిషి చెప్పారు. ఎందుకంటే బీజేపీ నాయకులు అభివృద్ధి పేరుతో పేదల ఆవాసాలను ధ్వంసం చేస్తారని, పేదల ఓట్లను తొలగిస్తారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ఆప్, ప్రతిపక్ష బీజేపీ నేతలు ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నారు.

## పంచాయితీలకు బిల్లుల చెల్లింపు

- అసెంబ్లీలో వాడీవేడిగా చర్చ
- ప్రభుత్వం తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్
- బకాయిల రాష్ట్రమితి అంటూ సీతక్క కౌంటర్



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాడి వేడిగా చర్చ జరిగింది. రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు విడుదల చేస్తున్నారని..కానీ సర్పంచులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రూ.691 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు

వివరాలు 2లో

# జాబ్ క్యాలెండర్ ప్రకారమే నోటిఫికేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

క్యాలెండర్ ప్రకటించామని దశలవారీగా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. కాగా, 'అదిగో జాబ్ క్యాలెండర్.. ఇదిగో జాబ్ క్యాలెండర్' అంటూ నిరుద్యోగులను ఊరించిన రేవంత్‌రెడ్డి సర్కారు, ఈ ఏడాది ఆగస్టు 3న గత అసెంబ్లీ సమావేశాల ఖాళీల వివరాల్లేని.. నోటిఫికేషన్, పరీక్షల తేదీల్లేని జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉసూరుమనిపించింది. జాబ్ క్యాలెండర్‌లో మొత్తం 20 రకాల షెడ్యూళ్లను ప్రకటించగా వీటిలో అర్హత పరీక్ష అయిన టెట్ రెండు సార్లు ఉన్నది. మిగతా 18లో గ్రూప్-1, 2, 3 నోటిఫికేషన్లు గతంలో జారీ అయినవే కావడం గమనార్హం. పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉన్న వీటిని కూడా కొత్త జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించి కాంగ్రెస్ సర్కారు తన ఖాతాలో వేసుకున్నది. యూపీఎస్సీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుంది. నోటిఫికేషన్ తేదీ, దరఖాస్తు గడువు, రాత పరీక్ష తేదీ లాంటి పూర్తి వివరాలు అందులో పొందుపరుస్తుంది. కానీ రేవంత్ సర్కారు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో ఇవేవీ లేవు. కేవలం ఫలానా నెలలో నోటిఫికేషన్ ఇస్తాం.. ఫలానా నెలలో పరీక్ష నిర్వహిస్తామన్న వివరాలు మాత్రమే ప్రకటించారు.

# హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

(మొదటి పేజీ తరువాయి)

10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శ్‌నగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహిర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.

# నెహ్రూ లేఖలను మాకు అప్పగించండి

## ● రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం లేఖ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, డిసెంబర్ 16:** భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రాసిన లేఖల విషయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వం లేఖ రాసింది. నెహ్రూ రాసిన లేఖలను తిరిగి అప్పగించాలని ప్రధానమంత్రి సంగ్రహాలయం కోరింది. 2008లో ఆ లేఖలను సోనియా గాంధీ తీసుకెళ్లినట్లు పేర్కొంది. వాటిని తిరిగి అప్పగించే విషయంలో సహకరించాలని లేఖలో విజ్ఞప్తి చేసింది. చరిత్రక ప్రాముఖ్యత కలిగిన నెహ్రూ లేఖలను జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ 1971లో నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీకి అప్పగించింది. అయితే 2008లో యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆ లేఖలను సోనియా గాంధీకి పంపారు. అప్పటి నుంచి అవి సోనియా వద్దే ఉన్నాయి. ఆ లేఖలను తిరిగి అప్పగించాలని ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే ప్రధాన మంత్రి లైబ్రరీ కోరింది. దీనిపై స్పందించకపోవడంతో రాహుల్ గాంధీకి డిసెంబర్ 10న మరోసారి లేఖ రాసింది. కనీసం ఫొటో కాపీలు లేదా డిజిటల్ కాపీలైనా అందజేయాలని అందులో కోరింది.

# మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో చోరీ

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో భారీ దొంగతనం జరిగింది. జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలోకి కొంతమంది దుండగలు చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఉన్న 7.5 లక్షల రూపాయల నగదును దుండగులు చోరీ చేసినట్లు సమాచారం. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న జైపాల్ యాదవ్ ఫిలిం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయన నివాసానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై విచార చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# నేడు లోక్‌సభ ముందుకు జమిలి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

సభ ముందుకు రాలేదు. మంగళవారం ఈ బిల్లులు లోక్‌షభ ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది. ఈ క్రమంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకు ఈ బిల్లు రానుంది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం లోక్‌సభ లో ప్రవేశపెట్టనుంది. జమిలి ఎన్నికల నిర్వహణపై అనేక అనుమానాలు నెలకొన్నవేళ దీనిపై విస్తృత సంప్రదింపుల కోసం బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ (ఏఖఆ)కి పంపించాలని స్పీకర్ ఓం బిర్లాను కేంద్రమంత్రి అభ్యర్థించనున్నారు. అనంతరం దీనిపై ప్యానెల్ కమిటీ ఏర్పాటుకు సభ్యులను ప్రతిపాదించాలని సభాపతి పార్టీలను కోరనున్నారు. సాయంత్రానికి కమిటీ సభ్యులను ప్రకటించే అవకాశం ఉంది. పార్లమెంట్‌లో పార్టీల సంఖ్యాబలం ఆధారంగా కమిటీలో వారికి చోటు దక్కుతుంది. అంటే అతిపెద్ద పార్టీ అయిన భాజపా నుంచి ఒక ఎంపీ కమిటీ ఛైర్మన్‌గా ఉంటారు. తొలుత ఈ ప్రతిపాదిత కమిటీకి 90 రోజుల సమయం కేటాయిస్తారు. అవసరాన్ని బట్టి ఆ తర్వాత దాన్ని పొడిగిస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో జమిలి ప్రణాళికకు ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులను కేంద్ర కేబినెట్ ఈనెల 12న ఆమోదించింది. వీటిని ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే లోక్‌సభ ముందుకుతీసుకురావాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది. ప్రస్తుత శీతాకాల సమావేశాలు ఈనెల 20తో ముగియనున్నాయి.

# కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం నియమించారని చెప్పారు. తనను ఛైర్మన్‌గా, సహచర మంత్రులు దామోదరం రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. ఈ ఉప సంఘం పలుమార్లు సమావేశమై.. సిఫారసులను కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారుతెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారు. అంతే గాకుండా రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నుండి సేకరించిన సూచనలను కుడా మంత్రివర్గ ఉప సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం.. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ చేసిన సిఫారసులు.. కేబినెట్ ముందుంచినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను చేబడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో పాటు తాండాలలో కుడా చౌక ధరల దుకాణాల ఏర్పాటు చేస్తామన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలెవ్వరు వినియోగించక పోవడంతో.. దారి మళ్లుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే తెల్ల రేషన్ కార్డు దారులందరికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో.. 91 లక్షల 68 వేల 231 రేషన్ కార్డులు ఉందేవన్నారు. మొత్తం లబ్ధి దారుల సంఖ్య 3.38 కోట్లని ఆయన సభకు వివరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇక్కడి నుండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారని.. 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణా ఏర్పడ్డాక 2.7 కోట్ల లబ్ధిదారులకు గాను మొత్తం 89 లక్షల 21 వేల 907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

సంఘటన జరిగినప్పుడు, టూరిజంపైన అసెంబ్లీలో చర్చ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అద్దం పడుతుందని కేటీఆర్ విమర్శించారు. లగచర్ల అంశంపై శాసనసభలో చర్చించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అసలైన అప్పులతో రాష్ట్ర ప్రభుత్వం సవరణ స్టేట్‌మెంట్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సవరణ ఇవ్వని పక్షంలో సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. గతంలో తానే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను అప్పటి స్పీకర్ మనోహర్ అంగీకరించారని గుర్తుచేశారు. దానిపై అప్పుడు సభలో చర్చ జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న పద్ధతులు, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో ఉన్నటువంటి సాంప్రదాయాలను పరిగణలోకి తీసుకుని సభా హక్కుల ఉల్లంఘన తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభలో అనుమతి ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై బయట కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 7 లక్షల కోట్ల అప్పు అంటూ లేని అప్పు గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్కలు తప్పు కాబట్టి.. ఈ ప్రభుత్వం కడుతున్నామని చెబుతున్న నెలకు 6వేల 500 కోట్ల వడ్డీ లెక్కలు కూడా తప్పే అని స్పష్టం చేశారు. ఏడాదికి కేవలం రూ.22 వేల కోట్ల వడ్డీ మాత్రమే కడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉండగా కేవలం టూరిజంపైనే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు స్వీకరించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి 100కి పైగా చేసిన పర్యటనలతో ఢిల్లీ టూరిజం బాగా పెరిగిందని విమర్శించారు. మరోవైపు 40 మంది లగచర్ల రైతులను జైలులో పెట్టడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సోషల్ మీడియా కార్యకర్తల నుంచి మొదలుకొని పార్టీ నాయకులను జైల్లో పెడుతున్న జైలు టూరిజం.. బెయిల్ వచ్చిన తర్వాత కూడా నటులను జైలులో ఉంచుతున్న జైలు టూరిజం.. ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతుంటే జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి చేస్తున్న జైలు టూరిజం.. ఈ విధంగా తెలంగాణలో జైలు టూరిజం బాగా నడుస్తుందని అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై కూడా శాసన సభలో చర్చకు లేవనెత్తామని కేటీఆర్ తెలిపారు. సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశామన్నారు. గత నెలలో బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిన రూ.1200 కోట్ల నిధుల్లో సగం ఇస్తే.. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని స్పీకర్ కు కూడా విజ్ఞప్తి చేశామని నచెప్పారు. లగచర్ల అంశంపై కూడా సభలో చర్చించాలని స్పీకర్‌ను కోరినట్లు కేటీఆర్ తెలిపారు. రైతులను అక్రమంగా జైలులో ఉంచిన కాంగ్రెస్ సర్కార్ తీరుపై రాష్ట్ర ప్రజలు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ వైఖరిని శాసన సభలో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ ఖేల్ ఖతం అని తెలుసు

## ● అందుకే కెసిఆర్ సభకు రావడం లేదు: మంత్రి కోమటిరెడ్డి సెటైర్లు



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** ఐదుగురు ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా భట్టి విక్రమార్క రోజూ సభకు వచ్చారని.. 38 మంది ఉన్న బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ ఎందుకు రావడం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి కంటే ఎక్కువ విలువ ప్రతిపక్ష నాయకుడికి ఉంటుందన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖతం అవుతుంది అని కేసీఆర్ ముందే తెలుసుకొని సభకు రావడం లేదన్నారు. అసెంబ్లీ లాబీల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం కేసీఆర్‌కు లేదని.. అందుకే అసెంబ్లీ వస్తలేరు అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. కొడుకు , అల్లుడు , బిడ్డలను తాము పట్టించుకోమన్నారు. డీలిమిటేషన్‌లో 34 అసెంబ్లీ సీట్లు, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయన్నారు. జమిలి డ్రాఫ్ట్ రెడీ అయిందన్నారు. మా సీఎం , మంత్రులు పబ్లిక్‌కి అందుబాటులో ఉంటున్నాము ప్రతిపక్ష హోదా లేకున్నా ఖర్గే, అధిర్ రంజన్ చౌదరి పార్లమెంట్‌కి వెళ్లారన్నారు. బ్జడెట్ సమావేశాల వరకు కొత్త మంత్రివర్గం రెడీ అవుతుందని ఆయన వెల్లడించారు.కాంగ్రెస్‌లో మంత్రి వర్గ విస్తరణలో ఎవరికి పదవులు అనేది ఎవరు చెప్పలేరన్నారు. ఈ విషయం పార్టీ అధిష్ఠానం, సీఎందే తుది నిర్ణయమన్నారు. పాలమూరు నుంచి శ్రీహరికి కచ్చితంగా మంత్రి పదవి.. ఇది మాత్రం చెప్పగలనన్నారు. నల్గొండలో 2018లో భూపాల్ రెడ్డిని వికలాంగుడు అనే సానుభూతితో గెలిపించారంటూ మంత్రి విమర్శించారు. ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ ఓడారు.. నేనెంత అంటూ వ్యాఖ్యానించారు. కల్వకుర్తిలో ఎన్టీఆర్ మీద చిత్త రంజన్ ఇంట్లో నుంచి గెలిచారన్నారు. తన మీద గెలిచేందుకు బూర నర్సయ్య రూ.80 కోట్లు ఖర్చు పెట్టారని.. అయినా తానే గెలిచానన్నారు. ప్రతిపక్ష ఎంపీగా ఎన్నో రోడ్ ప్రాజెక్టులు తీసుకొచ్చామన్నారు. గడ్కరీ నిన్న సీఎంకు చెబుతూ.. వెంకన్న నాకు చోటా బాయ్ అన్నారన్నారు.

# హైదరాబాద్ కాంగ్రెస్ సమీక్ష రసాభాస.... మంత్రి పదవి కోసం అంజన్ కుమార్ పట్టు..!

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** గాంధీభవన్‌లో సోమవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ తెలంగాణ ఇన్ చార్జీ దీపాదాస్ మున్షీ నిర్వహించిన సమీక్షా సమావేశం రసాభాసగా ముగిసింది. సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వ్యాఖ్యతో దీపాదాస్ మున్షీ సమావేశం నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. తన కొడుకు అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ ఇచ్చినంత మాత్రాన తమ కుటుంబానికి మరో పదవికి ఇవ్వకూడదా? అని అంజన్ కుమార్ యాదవ్ నిలదీశారు. తనకు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవి ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు.2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన అంజన్ కుమార్ యాదవ్ 2014, 2019 లోక్ సభ ఎన్నికల్లోనూ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ స్థానం నుంచి ఓటమి పాలయ్యారు. ఇదిలా ఉంటే అంతకు ముందు దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేస్తేనే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు.

# పంచాయితీలకు బిల్లుల చెల్లింపు

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. దీనికి మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. గత ప్రభుత్వమే ఈ బకాయిలు చెల్లించాల్సి ఉంటే బాగుండేదని చురకలంటించారు. బిఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితిగా మారిందని దుయ్యబట్టారు. సర్పంచ్ ల బకాయిలు తమ ప్రభుత్వానికి బిఆర్ఎస్ వారసత్వంగా ఇచ్చిందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నెలా రూ.274 కోట్లు గ్రామ పంచాయతీలకు ఇచ్చామని హరీశ్ చెప్పారు. అయితే ప్రభుత్వ తీరునకు నిరసనగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సోమవారం ఉదయం మళ్లీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ.. సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ. 691 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయి విమర్శించారు. ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని నిలదీశారు. గవర్నర్, మంత్రులను కలిసి సర్పంచులు మొరపెట్టుకున్నారని.. చలో అసెంబ్లీ చేపడితే నిరసనకారులను అరెస్టు చేశారని చెప్పారు. అయితే, సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వట్లేదని బిఆర్ఎస్ మెంబర్స్ నిరసన తెలుపుతూ..శాసనసభ నుంచి వాకౌట్ చేశారు.

# హైదరాబాద్‌లో ఆగని డ్రగ్స్ దందా

## ● మీర్‌పేట్‌లో భారీగా పట్టుబడ్డ డ్రగ్స్

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** తెలంగాణ నార్కోటిక్ అధికారులు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నా.. హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా మాత్రం ఆగడంలేదు. తాజాగా మీర్‌పేట్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడడం కలకలం రేపుతోంది. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు టాస్క్‌ఫోర్స్ పోలీసులు. వారి నుంచి 53 కేజీల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు పోలీసులు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో భారీగా రక్షణ స్వాధీనం చేసుకున్నారు ఎల్బీనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు. మీర్‌పేట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. ఈ తనిఖీల్లో పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు నిందుతుల నుంచి కోటి 25 లక్షల రూపాయల విలువచేసే 53.5 కిలోల పప్పీస్ట్రా డ్రగ్ సీజ్ చేశారు రాచకొండ పోలీసులు.రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఈజీ మనీ కోసం అలవాటు పడిన నిందితులు నార్కోటిక్ డ్రగ్స్ ను విక్రయించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్, బిష్ణోయ్ మంకీలాల్ దాకా రామ్ ముగ్గురు నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన పింటూ అనే వ్యక్తి నుంచి పప్పీస్ట్రా మాదకద్రవ్యాలని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాదులో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారుఅయితే ఈ మాదకద్రవ్యాలను లారీలు, బస్సులు, ట్రైన్ ద్వారా నగరానికి తీసుకువచ్చి కన్స్యూమర్లకు అమ్ముతున్నారని రాచకొండ సీపీ తెలిపారు 2023లో మంకీలాల్ బిష్ణోయ్‌ను హయత్ నగర్ పోలీసులు డ్రగ్స్ కేసులో అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. ఇతనిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని సీపీ తెలిపారు. కాగా మెయిన్ పెడ్లర్ గా ఉన్న పింటూను పట్టుకోవడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా మరో ముగ్గురు నగరంలో స్థానిక రిసీవర్సుగా ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని రాచకొండ సీపీ తెలిపారు. అయితే ఈ పప్పీస్ట్రాను పాలు వాటర్, ఛాయ్‌లో కలుపుకుని తాగుతారు. మరోవైపు, ఈ కేసు ఇంకా విచారణలో ఉందని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని రాచకొండ సిపి సుధీర్ బాబు వెల్లడించారు.

# లోకో మోటివ్ పిరియాడికల్ వర్క్ షాపు ఏర్పాటు చేయాలి

● జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతి పత్రం అందజేసిన మజ్దూర్ యూనియన్ నాయక్

**తొలి అక్షరం/నెల్లికుదురు,(మహబూబాబాద్)డిసెంబర్ 16:** మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో లోకో మేటివ్ పిరియా డికల్ వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ కు వినతి పత్రాన్నిఅందజేశారు.సోమవారం మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ ఆవుల యుగంధర్ ఆద్వర్యంలో యూనియన్ బృందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్రైల్వే మంత్రిని కలిసి మంజూరు చేయించేందుకు శక్తి మేరకు కృషిచేస్తానని మజ్దూర్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ ఆవుల యుగంధర్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రం, గిరిజన పార్లమెంట్ కేంద్రంలో లోకో మోటివ్ పిరియాడికల్ వర్క్ షాపు (లోకోమోటివ్ పి వోహెచ్ )ఏర్పాటు చేయాలని ,గిరిజన జనాభా అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో లోకోమోటివ్ ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు రావడంతో పాటు,మహబూబాబాద్ జిల్లా అభివృద్ధి చెందుతుందని అన్నారు.మహబూబాబాద్ సమీపంలో ప్రభుత్వం భూమి అందుబాటులో ఉన్న విషయం అయన దృష్టికి తీసుకెళ్లారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి 5 కిలోమీటర్ల సమీపంలో ఉన్న తాళ్ళపూస పల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే భూమి కుడా ఉందని వివరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ... మహబూబాబాద్ ప్రాంతంలో నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పించే ఇటువంటి ప్రాజెక్ట్ ఖచ్చింతంగా రావాలని, అందుకోసం రైల్వే శాఖ మంత్రి ని కలిసి మంజూరు అయ్యేలా కృషి చేస్తానని అన్నారు.సీనియర్ బిజెపి నాయకులు అశోక్ రెడ్డి, గడ్డం ఆశోక్, శ్యామ్, అజయ్, మజ్దూర్ యూనియన్ నాయకులు భాస్కర్ రావు, బుర్రి రమేష్, కొండ్ర నాగన్న తదితరులు పాల్గొన్నారు.




# వైభోపేతంగా అయ్యప్ప మహాపడి పూజ

● స్వాముల నృత్యాలతో హెూరెల్లిన శివాలయం ● వాడవాడలా గడపగడపకు అయ్యప్ప రథోత్సవం ● నర్సింహులపేట గ్రామ పడిపూజా కార్యక్రమంలో దేవేందర్ శర్మ









**తొలి అక్షరం/నర్సింహులపేట, డిసెంబర్ 16:** నర్సింహులపేట మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర నవగ్రహ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం గ్రామ అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో గ్రామ అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు.స్వామి వారిని అరటి చెట్ల గుజ్జుతో,పూలతో అలంకరించారు.గ్రామ అయ్యప్ప కమిటీ భక్త బృందం ఆధ్వర్యంలో పడిపూజను ప్రారంభించారు.అయ్యప్ప స్వామికి పూలు, పంచామృతం, అభిషేకాలు నిర్వహించి అయ్యప్ప స్వాములు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి.అభిషేకాల అనంతరం స్వామివారికి నూతన వస్త్రాల అలంకరణతో వేదిక పైకి తీసుకువచ్చారు.శ్రీ రాజరాజేశ్వర నవగ్రహ ప్రసన్నాంజనేయ స్వామి శివాలయంలో స్వాముల అయ్యప్ప స్మరనలతో శివతాండవం తలపించింది.వేద మంత్రాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు దేవేందర్ శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించి.అయ్యప్ప స్వామి పద్దెనిమిది మెట్లను అయ్యప్ప స్వాములు పడిని వెలిగించారు.స్వామి వారి హారతిని భక్తులందరికీ చూపారు.స్వామివారి తీర్థ ప్రసాదాలను నైవేద్యాలను అందజేశారు.ఈ సందర్భంగా శివాలయం అర్చకులు దేవేందర్ మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం దాతగా మాజీ దేవస్థానం చైర్మన్ బొల్లం రమేష్ అన్నదాన కార్యక్రమం దాతగా ఇచ్చినట్లు సుమారు ఐదు వందల మందికి అయ్యప్పలు గ్రామ ప్రజలకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రంలో అలంకరించిన రథోత్సవంలో స్వామి వారిని వాడవాడలా గడపగడపకు ఊరేగింపు చేస్తూ డీజేలతో నృత్యాలు చేస్తూ స్వామి వారిని రథాన్ని లాగుతూ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గురు స్వామి యాదగిరి గుండాల బిక్షం విక్రమ్. అయ్యప్ప స్వాములు కోడి నరసయ్య. ఏరా నాగి రమేష్. మల్లయ్య గణేష్ సాయి .విష్ణు. రాజేందర్ తోపాటు 200 మంది అయ్యప్ప స్వాములు ఈ రథం కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం ఈ కార్యక్రమంలో మహిళలు అయ్యప్ప స్వాములకు మంగళారతులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అయ్యప్ప స్వామికి స్వాగతం పలికారు వాడవాడనా మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులు పట్టుకొని తిరిగారు

# సమస్యలు ఉన్న స్పందించక పోతే ఎల్లా..??






● సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న...

**తొలి అక్షరం/నెల్లికుదురు,డిసెంబర్ 16:**మండల వ్యాప్తంగా ప్రతి గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్న అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం చాల శోచనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న ఎద్దేవా చేశారు.సోమవారం మండలంలోని గ్రామాల్లోని మదనతూర్తీ ,బంజర లక్ష్మీపురం గ్రామాలలో ఇంటింటికి సిపిఎం సర్వేలో సమస్యలపై అధ్యయనం చేయడం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న మాట్లాడుతూ ,మదనతూర్తి లో రైతులకు అనుకూలమైన మదనతుర్తి మునిగలవేడు కౌసల్యదేవిపల్లి బొజ్జన్నపేట రైతులకు ఉపయోగపడే తుమ్మల బంధం నుంచి మొదలైన కాలువ గ్రామ సమీపన అకాల వర్షాలకు తెగిపోవడం వలన రైతులకు నీరు వచ్చే అవకాశం లేదని, గత నాలుగు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోకుండా తుమ్మల బంధం చెరువుకు పోయే కాలువ ఇబ్బందికరంగా ఉన్నదని అనేకసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని మదనతుర్తి మునిగలవేడు మధ్యలో బ్రిడ్జి నిర్మాణం అస్తవ్యస్తంగా ఉందని దానివలన గతంలో స్కూల్ పిల్లలు కూడా ఆ బ్రిడ్జిపై నుంచి మునిగేలవేడు పాఠశాలకు వచ్చేది అది ఇబ్బంది కావడం వలన పిల్లల చదువులకు ఆటంకంగా మారిందని తక్షణమే ఆ బ్రిడ్జిని వేడల్పు నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు గ్రామ రైతులు కే జనార్ధన్ జి.యాకయ్య గట్టు సోమయ్య నిమ్మల లచ్చయ్య బిర్రుప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.




# పౌర్ణమి సందర్భంగా రామేశ్వరంలో అన్నదాన కార్యక్రమం



**తొలి అక్షరం/ఫరూక్ నగర్, డిసెంబర్16:** రంగారెడ్డి జిల్లా, షాద్ నగర్, ఫరూక్ నగర్ మండల్ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం రామేశ్వరంలో ప్రతినెల పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో భాగంగా దత్త పూర్ణిమ కు ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ పూర్ణిమకు అన్నదాత ఎల్కుర్తి నారాయణ రామేశ్వరంలో ప్రతినెల పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం గత ఆరు సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్, సామాజిక వేత్త నీల రవీందర్, బెజవాడ యశ్వంత్ రాజ్, హన్మారి మురళి, పోల బాలరాజు, వీరేష్ ,అశోక్, నీల శ్రీ వర్ధన్, సాయి, స్వర్ణలత, వరలక్ష్మి, నరసమ్మ, లక్ష్మీదేవి, తదితర భక్తి బృందాలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల నుంచి పారిపోతున్న కాంగ్రెస్

- ఎంత తప్పించుకున్న కాంగ్రెస్ పాలనను ఎండగడతాం : జగదీశ్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్ 16:** ప్రజా సమస్యల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి విమర్శించారు. ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పారని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రజలపై పడిందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడాబాబులకు దోచిపెట్టే కుట్రకు తెరతీసిందని ఆరోపించారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. జైలులో ఉన్న లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారని అన్నారు. లగచర్ల ఘటనపై చర్చకు కోరితే ప్రభుత్వం పారిపోయిందని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తించాలని జగదీశ్ రెడ్డి సూచించారు. స్పీకర్ మా నోరు నొక్కుతున్నారని తిట్లు తిట్టేవారికే అవకాశం కల్పిస్తున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల రైతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తిపై ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలన నుంచి పారిపోతోందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

# కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన నిర్వాహకుల నిరసన

**తొలి అక్షరం/జగిత్యాల,డిసెంబర్ 16:** జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజననిర్వాహకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు.నిత్యవసర వస్తువుల ధరలు పెరిగినందున మధ్యాహ్నభోజనం బిల్లులను పెంచి చెల్లించాలని వారు డిమాండ్చేశారు. నెలల తరబడి బిల్లులుచెల్లించకపోవడందారుణమని మండిపడ్డారు. అప్పులు చేసి భోజనంతయారు చేయాల్సి వస్తుందని వాపోయారు.



# అసెంబ్లీ సమావేశాల్లో గొల్లకురుమల సమస్యల గురించి చర్చించాలి

- 19న చలో హైదరాబాద్ జయప్రదం చేయండి
- జిఎంపిఎస్ మండల కార్యదర్శి జక్క రవి



**తొలి అక్షరం/చెన్నారావుపేట డిసెంబర్ 15:** సోమవారం నుండి జరిగే శీతకాల అసెంబ్లీ సమావేశాల్లో గొల్లకురుమల సమస్యల గురించి చర్చించాలని గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘంట జిఎంపిఎస్ చెన్నారావుపేట మండల కార్యదర్శి జక్క రవి అన్నారు.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల ఖాదర్ పేట,జల్లి, గొల్లపల్లె, చెన్నారావుపేట గ్రామాలలో ఈనెల 19న ఇందిరాపార్క్ ముందు నిర్వహించే ధర్నాని జయప్రదం చేయాలని ముద్రించిన కరపత్రాలను గొల్లకురుమల నాయకులతో కలిసి ఆవిష్కరించారు అనంతరం చెన్నారావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి జక్క రవి మాట్లాడుతూ నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ సమావేశాలలో గొల్లకురుమల సమస్యల గురించి మాట్లాడి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వ భూములను రక్షించి గొర్రెల కాపరులకు మూగజీవాల మేత కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు, కుక్కల దాడిలో,ఇతర కారణాలతో చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్ తో సంబంధం లేకుండా గొర్రెల కాపరికి నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలి, తదితర డిమాండ్ల సాధనకై డిసెంబర్ 19న ఇందిరాపార్క్ ముందు నిర్వహించే ధర్నాకు గొల్ల కురుమలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం మండల ఉపాధ్యక్షులు కుండే కుమారస్వామి, జక్క వెంకటేశ్వర్లు, కుండే కట్టయ్య, గుంటి కుమారస్వామి, కుండే రవి,కుక్కల రాజు,ఆరె మహేందర్,కుక్కల రజనీకాంత్, కుక్కల అజయ్, వడ్డే రవి, బట్టమేకల రవికుమార్, బట్టమేకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రం స్టేషన్లో సిపిఎం పార్టీ ఇంటింటి సర్వే



**తొలి అక్షరం/కేసముద్రం, డిసెంబర్ 16:** సోమవారం రోజున కేసముద్రం స్టేషన్లో టౌన్ శాఖ కార్యదర్శి జల్లే జయరాజు ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ ఇంటింటి సర్వే నిర్వహించడం అయినది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు ,కేసముద్రం మండల సిపిఎం పార్టీ కార్యదర్శి గొడిషాల వెంకన్న మాట్లాడుతూ ప్రజలు గత ఎండాకాలంలో ఉపాధి హామీ పనులు చేసి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం ఎందుకని వారు ప్రశ్నించారు .తక్షణమే ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించాలని లేని ఎడల ఉపాధి హామీ కూలీలతో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తామని అన్నారు. కేసముద్రం స్టేషన్ ఐదో వార్డులో కరెంటు స్తంభం నడి మధ్యలో నుండి సిసి రోడ్డు వేయడం వల్ల కాళినివాసులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కరెంటు స్తంభం మధ్యలో నుండి సిసి రోడ్డు వేసిన అనంతరం అధికారుల నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపం ఉందని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్నటువంటి కరెంటు స్తంభాలను తొలగించాలని కోరారు. ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు సాంక్షన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. మండల కమిటీ సభ్యులు వేల్పుగొండ సావిత్ర ,సోమవారం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శివ మారుతి గీత అయ్యప్ప మందిరంలో మారుమ్రోగిన శ్రీ అయ్యప్ప స్వామి నామస్మరణ

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష

**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్16:** షాద్ నగర్ పట్టణంలోని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో శ్రీ అయ్యప్ప స్వామి నామ స్మరణ మారుమ్రోగింది. అయ్యప్ప స్వాములు, భక్తులు శ్రీ అయ్యప్ప స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగానే అయ్యప్ప స్వాములకు నిత్య బిక్ష కార్యక్రమంలో భాగంగా ఈ రోజు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్వాములకు బిక్షా ప్రసాదాన్ని వితరణ చేశారు. ప్రతి యేటా వేలాది మంది అయ్యప్ప స్వాములకు నిత్య బిక్షను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు నిత్య బీక్ష నిర్వాహకుల పనితీరులను కొనియాడారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ సహకార యూనియన్ చైర్మన్ రాజవరప్రసాద్, వెంకట్రాం రెడ్డి, రేటికల్ నందీశ్వర్, రఘునాథ్ యాదవ్, చెట్ల నరసింహా, లక్ష్మీనరసింహా రెడ్డి, చింటూ, సిద్దెల శ్రీనాథ్, సత్యనారాయణ, గుండు అశోక్, పులిజాల నవీన్, సందీప్ సింగ్, గుడ్డు యాదవ్, శీలం శ్రీకాంత్, తమకొండ రాజశేఖర్, కావలి అశోక్ యాదవ్, దుమ్మని నవీన్, నార్ల శ్రీనివాస్, రాఘవేందర్ గౌడ్, సాయి తేజ, జగన్ తదితరులు పాల్గొన్నారు.



# కొన్ని పత్రికలో వచ్చిన తప్పుడు వార్తను కండించిన బానోత్ అనూష

- నిన్నటి రోజు జరిగిన అవాస్తవ ఘటనను ఖండిస్తూ వివరణ



**తొలి అక్షరం/పెద్దవంగర డిసెంబర్ 16:** బానోత్ అనూష W/o రాజేష్ R/o శంకర్ తండా H/o మోత్య తండా గ్రామం గారి వివాహం బానోతు రాజేష్ S/o బిచ్చ, R/o సప్పిడి తండా గ్రామం కేసముద్రం మండలం గారితో 2016లో వివాహం జరగగా వీరికి ఇద్దరు పిల్లలు కలరు, గత సంవత్సర కాలంగా బానోత్ రాజేష్ పరాయి స్త్రీతో అక్రమ సంబంధం పెట్టుకుని తన తల్లిదండ్రులతో కలిసి తన భార్య అయిన అనూషను అధనపు వరకట్నం కోసం మానసికంగా శారీరకంగా వేధించడం వల్ల తను ప్రస్తుతం తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది ఇట్టి విషయంలో అనూష దరఖాస్తు చేయగా పలుమార్లు రాజేష్ ని తన తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేయగా వారు పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పందాలు చేసుకొని అట్టి ఒప్పందాలను కూడా అతిక్రమించి అనూషకు ఎటువంటి న్యాయం చేయకపోవడంతో తాను ఇచ్చిన దరఖాస్తు మేరకు రాజేష్ రాజేష్ తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేయడం జరిగింది. అట్టి కేసు విషయంలో రాజేష్ ను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ కు పిలిపించగా తను వచ్చి మాట్లాడుతూ స్టేషన్లో తనకేదో జరిగినట్టుగా ఇబ్బంది పడుతుండగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నట్టు నటించగా నిజమేమోనని నమ్మి వెంటనే హాస్పిటల్ కి తరలించడం జరిగింది. ఆ తర్వాత తను అనేక తప్పుడు ఆరోపణలు చేయడం జరిగింది అవన్నీ కొన్ని మీడియాలో రావడం జరిగింది అవి పూర్తిగా అవాస్తవం అని మీడియా కు తెలియచేసినారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



**తొలి అక్షరం/చెన్నారావుపేట డిసెంబర్ 16:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు.సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా గ్యాదే నవీన్, ఉపాధ్యక్షులుగా దాసరి రాము,కార్యదర్శిగా కన్నల రవి కుమార్,సంయుక్త కార్యదర్శి గా అనుముల సందీప్ కుమార్,మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అలువాల ఉమేష్ చందర్ లను నియమిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కమిటీ లకు ఎన్నికైన గ్యాదే నవీన్, దాసరి రాము, కన్నల రవికుమార్,అనుముల సందీప్ కుమార్,అలువాల ఉమేష్ చందర్ లు మాట్లాడుతూ మాపై నమ్మకంతో ఇచ్చిన పదవికి సరైన న్యాయం చేస్తూ,సంస్థ నియమనిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతినీ బయటకు తీస్తూ, సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను చేపడతామని చెప్పారు.

# రైతుల భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలి...

- సిపిఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్..



**తొలి అక్షరం/నెల్లికుదురు, (మహబూబాబాద్) డిసెంబర్ 16:** జమాండ్లపల్లి లో 2,3వ వార్డులో సాగుచేస్తున్న రైతుల భూములకు పట్టాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బాణోతు సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ పట్టణం లోని 2.3వ వార్డు జమాండ్లపల్లిలో వార్డు బాద్యురాలు పిట్టల తిరుపతమ్మ అధ్యక్షతన ఇంటింటికి సిపిఎం ప్రజా సమస్యలపై అధ్యాయనికి కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ మాట్లాడుతూ,2.3వార్డులు అయినా జమండ్ల పల్లిలో గత 40సం..రాలుగా సాగుచేసు కుంటున్న 70శాతం రైతులకు పట్టాలు రాకపోవడంతో రైతు బీమా రైతు బందు లాంటి ప్రభుత్వ పతకాలు పొందలేక పోతున్నారని అన్నారు. అనేక సార్లు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగిన పలుమార్లు చెప్పుకున్న చేద్దాం చూద్దాం అంటూ దాటావేశారని అన్నారు.పోరాటాల ద్వారానే రైతులకు పట్టాలు వస్తాయని సిపిఎం పార్టీ అధికారులు పట్టాలు ఇచ్చేంత వరకు రైతులకు అండగా ఉంటుందని పట్టాలు సాధన కొరకు నిరంతరం ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.పోరాటాల ద్వారానే పట్టణం లోని 5వేల మంది పేదలకు ఇంటి పట్టాలు ఇప్పించిన ఘనత ఎర్ర జండాదే అని అన్నారు.వార్డుల్లో పూర్తిగా సైడ్ డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం తో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు .పింఛన్ లు రేషన్ కార్డులు ఇంకా అందని వాళ్ళు చాలా మంది ఉన్నారని అన్నారు .ప్రభుత్వం అర్హులైన నీరు పేదలను గుర్తించి ఇందిరామ్మా ఇండ్లు ఇవ్వాలని లేని వెడల ప్రజా ఉద్యమాలు చేస్తామని డిమాండ్ చేసారు.వార్డు భాద్యులు ఎలకటి సైదులు. దొడ్డా రాజేశ్వరి.కొప్పుల వెంకన్న. అక్కెన పల్లి విజయ్.బొమ్మగాని మహేష్ ఎండీ మాదిన.బుర్ర కవిత. బుర్ర కార్తీక్. పిరల కుమార్. కొప్పుల ఎల్లమ్మ. మక్కాల సురేష్ పాల్గున్నారు.



# కదిరే యశోద పార్థివదేహానికి నివాళులర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి

- మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు




**తొలి అక్షరం/కేసముద్రం డిసెంబర్ 16:** కేసముద్రం మండలం అన్నారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కదిరే ప్రకాష్ గారి తల్లి కదిరి యశోద గారు మృతిచెందగా పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి లికేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు వారితోపాటు బండారు దయాకర్, మాజీ ఎంపీపీ కదిరే సురేందర్,గండి శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నేటి ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి..!!

- జిపి వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం ఎల్లయ్య..



**తొలి అక్షరం/నెల్లికుదురు, డిసెంబర్ 16:** తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ సిఐటి గ్రామపంచాయతీ కార్మికుల సమస్య పరిష్కారానికి నేడు చలో హైదరాబాద్ జరుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జి పి వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బోల్లం ఎల్లయ్య పిలుపు నిచ్చారు.సోమవారం గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలపై స్థానిక ఎంపీడీఓ బలరాజుకు వినతి పత్రం అందజేశారు.అనంతరం ఎల్లయ్య విలేఖర్లతో మాట్లాడుతూ,51 జీ ఓ సవరన కనీసవేతనం 26 వేలు ఇవ్వాలని,ఉద్యోగ భద్ర త కల్పిచాలని. ఇ ఎస్ ఐ పీఫ్ సౌకర్యం కల్పిచాలని. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ కె చాందు పాషా ,హెచ్చు.వెంకన్న , ఐలయ్య ,గుగులోత్ రాంకోటి హెచ్చు,మల్లయ్య టీ, ఎల్లయ్య పాల్గొన్నారు.

# పురిటినొప్పులతో గ్రూప్-2 పరీక్ష

- గర్భిణికి అండగా అధికార యంత్రాంగం

**తొలి అక్షరం/నాగర్‌కర్నూల్,డిసెంబర్16:** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పురిటి నొప్పులతోనే ఓ అభ్యర్థి గ్రూప్–2 పరీక్ష రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి నాగర్ కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రూప్–2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ సిబ్బంది.. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఆమె అంగీకరించలేదు. పరీక్ష రాస్తానని చెప్పారు. ఆమె కాన్పు తేదీ ఇవాళే కావడంతో అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు. అయినా, ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో.. అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆమెకు ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. రేవతి భర్త, ఆమె తల్లి అందుబాటులో ఉన్నారు.



# మీ వెంటే నేనుంటా...

● తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 6వ మహాసభలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ● ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి ● ఉపాధ్యాయ సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి ● సంవత్సరం గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం ● మీ వెంట ఏ ఉద్యమానికైనా నేను సిద్ధం: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి




**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్16:** ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించడానికి ఉపాధ్యాయులు చేసే ఏ ఉద్యమానికైనా నేను నా వైపు నుంచి సహాయ సహకారాలు అందిస్తానని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కృతమయ్యే వరకు మీ వెంట పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ పట్టణంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరవ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఉపాధ్యాయ ఐక్య ఫెడరేషన్ సభ్యులను మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు అత్యంత గొప్ప ప్రతిభావంతులని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులదేనని అలాంటి ఉన్నత స్థానంలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఏ ప్రభుత్వ పాఠశాలలో చూసిన అన్ని సబ్జెక్టులకు సరిపోవు ఉపాధ్యాయులు లేరని, ఉపాధ్యాయులను నియమిస్తానని ప్రభుత్వం సంవత్సరం గడిచిన ఇప్పటివరకు నిర్లక్ష్యం చేస్తుందని, ఉపాధ్యాయులను నియమించకుంటే పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత ఎక్కువ శాతం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. సరియైన మౌలిక వసతులు లేని పాఠశాలల్లో ఒకవైపు విద్యార్థులు ఉంటే ఉపాధ్యాయులు లేక, మరొకవైపు ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు లేక విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని, పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు అన్ని రకాల వసతులు కల్పించాలని పాఠశాలల్లో ఏ ఏ రకాల అవకాశాలు ఉంటే బాగుంటాయో వాటన్నింటినీ తెలుసుకొని అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులపై పని ఒత్తిడి ప్రారంభించొద్దని, పని ఒత్తిడి భారం పెరిగితే ఉపాధ్యాయులు సరిగ్గా పనిచేయలేరని, పని ఒత్తిడి భారం లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తే ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం పెంచి ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తెస్తారని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుంటే వారు చేసే ఏ ఉద్యమానికైనా వారి వెంటే నేను సిద్ధం అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ పట్టణ మున్సిపల్ చైర్మన్ నరేందర్ తో పాటు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యులు, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిక్షయ్ శిబిరాన్ని పర్యవేక్షించిన జిల్లావైద్య అధికారి...



**తొలి అక్షరం/బసంత్ నగర్:** పెద్దపల్లి జిల్లా బసంత నగర్ లోని వడ్డెర కాలనీలో నిర్వహించుచున్న నిక్షయ్ శిబిరమును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డా . అన్నా ప్రసన్న కుమారి ఆకస్మికంగా సందర్శించారు. క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం లో భాగంగా నిర్వహించు చున్న ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి గ్రస్తుల ను గుర్తించుటకు తెమడ పరీక్షలను సేకరించుట, ఎక్స్ రే పరీక్షలు అవసరమైన వారిని పరీక్షకు తరలించుట పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వము క్షయ వ్యాధి సోకి తగ్గిన వారు, క్షయ వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యులు, పోషకాహార లోపం గలవారు, మధుమేహం కలవారు, హెచ్ఐవి సోకిన వారు మరియు 60 సంవత్సరముల వయసు పడిన వారందరికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించు కోవాలి అని అన్నారు.వడ్డెర కాలనీ, బసంత నగర్ లో నిర్వహించిన శిబిరం నందు (37) తెమడ పరీక్షలు , అప్పన్నపేట యందు (19) తెమడ పరీక్షలు సేకరించారు. వీటిని క్షయ వ్యాధి నిర్ధారణ కొరకు టి- హబ్ దయాగ్నోసిస్ కేంద్రము కు పంపించారు . అప్పన్నపేట యందు జరిగిన నిక్షయ్ శిబిరమును టి. బి (పో (గ్రాం అధికారి డాక్టర్ కే. వి . సుధాకర్ రెడ్డి పర్యవేక్షించారు

# షాద్ నగర్ చెస్ అకాడమీకి ప్రైజ్లే, ప్రైజులు

● తెలంగాణ చెస్ అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా చెస్ పోటీలు ● చెస్ పోటీలలో పాల్గొన్న షాద్నగర్ చెస్ అకాడమీ క్రీడాకారులు ● గెలుపొందిన విద్యార్థులను అభినందించిన చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్




**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్16:** హైదరాబాద్లో ఎల్ బీ స్టేడియంలో జరిగిన తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా నిర్వహించిన ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ లో షాద్ నగర్ పట్టణానికి చెందిన షాద్ నగర్ చెస్ అకాడమీ కోచ్ వానరసి జగన్ అధ్యర్యంలో పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 07, 09, 11, 13 విభాగలో ఈశాని, సుమీత్ కుమార్, దియాంషి రెడ్డి, చార్విక్ శౌర్యా, కార్తికేయ, శ్రీహర్షిత్, సాత్విక్, నిఖిల్ వీర వెంకటేష్, ఆదిదేవ రెడ్డి, భవీన్ రాథోడ్, ప్రణీత్ తేజ, ఉష శ్విని, దివ్య శ్రీ, సాయి సుశాంత్, సాత్విక్ గౌడ్, రిత్విక్ గౌతమ్, శ్రీలిఖిత్, ధనిష్ సాయి తేజ్, శ్రీ రోహన్, వేదన, వేధిత, సుగంధన్ చందరగా క్రీడాకారులు అందరూ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి మెరిట్ సర్టిఫికెట్లు,గోల్డ్ మెడల్స్, ట్రోఫీస్ సాధించారు. ఈ సందర్భంగా కోచ్ జగన్ మాట్లాడుతూ మెదడుకు పదును చేయాలంటే చెస్ ఆడాలని దీనితో జ్ఞాపకశక్తి పెరుగుతుందని పిల్లలు చురుకుగా తయారు అవుతారని తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

# అసెంబ్లీలో రైతుల అరెస్టులపై చర్చించాలి


● జైల్లో ఉండాల్సిన తప్పుడు రైతులు ఏం చేశారు : పాడి కౌశిక్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్ 16:** అసెంబ్లీలో చర్చించాల్సింది టూరిజంపై కాదని లగచర్లలో రైతులను అక్రమంగా అరెస్టు చేయడంపై చర్చించాలని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. లగచర్ల రైతులు చేసిన తప్పేంటని ప్రశ్నించారు. నెల రోజులుగా జైల్లో వేసేంత తప్పు అన్నదాతు ఏం చేశారని నిలదీశారు. గుండెపోటు వచ్చిన హీరా నాయక్‌ను బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లారని మండిపడ్డారు. తద్వారా యావత్ తెలంగాణ రైతులను అవమానించారని చెప్పారు. లగచర్లలో జరిగిన టెర్రర్‌పై చర్చ జరగాలని వాయిదా తీర్మానం ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. అదానీ, అల్లుడు, అన్నదమ్ముల కోసం రేవంత్ భూసేకరణ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం తప్ప రాష్ట్రంలో ఏమీ లేదని విమర్శించారు. వెంటనే ఎన్నికలు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఎన్నికలు వస్తే రేవంత్ పీడ వదలిపోతుందని రైతులు అనుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిపై 75 లక్షల మంది రైతులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. అప్పులపై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. ఆర్బీఐ హ్యాండ్ బుక్‌లో పేర్కొన్నదాని ప్రకారం తెలంగాణ అప్పు రూ.3 లక్షల 17 వేల కోట్లే. కానీ, అప్పు రూ.7 లక్షల కోట్లంటూ రాష్ట్ర ఆర్థిక మంత్రి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని చెప్పారు. మంత్రి భట్టి విక్రమార్కపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిస్తామని వెల్లడించారు.

# బల్దియాలో నోళ్లు తెరుచుకున్న మ్యాన్ హెూళ్లు...!

## - రోడ్డుపై ప్రయాణించాలంటేనే జంకుతున్న ప్రజలు..!!




**తొలి అక్షరం/గోదావరిఖని: డిసెంబర్ 16:** రామగుండం కార్పొరేషన్ పరిధి లోని ప్రతి డివిజన్లో ఎక్కడో చోట మ్యాన్ హెూల్ డామేజ్ అయి.. నోళ్లు తెరుచుకున్న.. పట్టించుకోని అధికారులు.కార్పొరేషన్ అధికారులకు ప్రజలు నిత్యం డ్రైనేజీ సమస్యలు, మాన్ హెూల్స్ సమస్యలు, మంచినీటి సరఫరా లో లీకేజీలపై ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. 26వ డివిజన్ మార్కండేయ కాలనీ ప్రధాన రోడ్డుపై గత కొన్ని నెలలుగా మాన్ హెూల్ డ్యామేజ్ అయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కార్పొరేషన్ లో అధికారులు అలంకార ప్రాయంగా ఉన్నారే తప్ప ఎలాంటి పరిష్కారం చేయడం లేదని స్థానిక ప్రజలు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులకు ప్రయాణికులకు ఇబ్బంది తలెత్తకుండా స్థానిక ప్రజలు సూచికలు ఏర్పాటు చేశారు అలాగే మెడికల్ కాలేజీ ప్రక్కనే రోడ్డుపై మెడికల్ కాలేజీ అవసరం కొరకు మంచినీటి వాల్ ఏర్పాటు చేశారని, అక్కడి గుంతను మాత్రం పూడ్చకుండా వదిలేశారని నిత్యం ఈ దారి గుండా ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు వందలాదిగా ప్రయాణిస్తారని స్కూల్ బస్సులు ఆటోలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. మూల మలుపు వద్ద ఈ గుంత ఉండడం వల్ల డేంజరస్ స్పాటుగా మారి పలు ప్రమాదాలు కూడా జరిగాయని దీనిపై కాలేజీ నిర్వాహకులకు, మున్సిపల్ వారికి తెలిపినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మంచినీటి సరఫరా లో కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సరఫరా లీకేజీలు పరిష్కరించడంలో సంబంధిత సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. బల్దియా అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# 21 వరకు అసెంబ్లీ సమావేశాలు

● బిఎసిలో స్పీకర్ నిర్ణయం

● వాకౌట్ చేసిన బిఆర్ఎస్, ఎంఐఎం

● బిస్కట్ అండ్ చాయ్‌గా సమావేశం అంటూ హరీష్ విమర్శలు



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్ 16:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరో ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ మేరకు బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 21 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. సోమవారం మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశమైంది. అయితే బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశారు. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ప్రకటించింది. మరోవైపు టీ షర్ట్స్‌పై బీఏసీలో వాడి వేడి చర్చ జరిగింది. టీ షర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీ షర్ట్స్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీష్ రావు ప్రశ్నించారు. బీఏసీ సమావేశంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. గంట సేపు సమావేశం జరిగినా సభ పనిదినాలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆయన అన్నారు. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేసినట్ల మాజీ మంత్రి తెలిపారు. 'మేము 15రోజులు సభ పెట్టాలని అడిగాము. సభను నాలుగైదు రోజులే నడిపే మూడ్‌లో ఉన్నారు. మమ్మల్ని అడ్వయిజ్ మాత్రమే ఇవ్వాలని సీఎం అన్నారు. కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అంటున్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసింది. ప్రోటోకాల్ పాటించడం లేదని స్పీకర్‌కు చెప్పాం. బీఏసీ పెట్టకుండానే బిల్స్ ఎలా పెడతారు అని అడిగాము. పెళ్ళిళ్లు ఉన్నాయని సభ పెట్టకపోవడం ఏంటని అడిగాము. కనీసం 15 రోజులు ఈసారి సభ నడపాలని బీఆర్ఎస్ నుంచి అడిగాం. ప్రతిరోజూ జీరో అవర్ పెట్టాలని అడిగాం. టీషర్ట్‌లతో ఎందుకు రానియడం లేదని గట్టిగా అడిగాము. మీ నాయకుడు రాహుల్ గాంధీ టీ షర్ట్‌లతో వెళ్ళాడు కదా అని గుర్తు చేశాము. బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారు' అంటూ హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు.బీఏసీ అంటే బిస్కెట్ అండ్ చాయ్ లాగా చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ భేటీ జరిగింది. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం హరీష్ రావు, ఎంఐఎం సభ్యులు హాజరయ్యారు. కాగా.. సభలో మీరు కేవలం సలహా మాత్రమే ఇవ్వాలని అనడంతో బీఆర్ఎస్ వాకౌట్ చేసిందన్నారు. ఇదే విషయంపై ఎంఐఎం కూడా వాక్ ఔట్ చేసిందని హరీష్ రావు తెలిపారు. సభ పని దినాలు అజెండా పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని నిరసన తెలిపామన్నారు. సభ గంటన్నర పాటు కొనసాగిందన్నారు.

# బిసి ఉద్యమనేత ఆర్ కృష్ణయ్యను కలిసిన బిసి నేత పాలవేన ప్రశాంత్



**తొలి అక్షరం/పెద్దపల్లి:** రెండోసారి బిజెపి రాజ్యసభ సభ్యులుగా సోమవారం ప్రమాణస్వీకారం చేసిన బిసి టైగర్ బిసి ఉద్యమనేతకి ఆర్ కృష్ణయ్యను బిసి నేత పొలవేన ప్రశాంత్ అభినందించారు. కృష్ణయ నాయకత్వములో బిసి వర్గల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఎంపి గా అవకాశం కల్పించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ కి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే



**తొలి అక్షరం/మంథని:** మంథని మున్సిపాలిటీ పరిధి ఐదవ వార్డు కూచిరాజుపల్లి లో సోమవారం రోజున మున్సిపల్ వార్డు ఆఫీసర్ శ్రీనివాస్ ఇంటింటి సర్వే నిర్వహించారు.ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకుంటూ సమగ్ర సర్వే నిర్వహించారు.

## యేసుక్రీస్తు ప్రేమ త్యాగం గొప్పది



**తొలి అక్షరం/మంథని:** యేసుక్రీస్తు మానవులపైన చూపించిన ప్రేమ,త్యాగం వెలకట్టలేనిదని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ అన్నారు. సోమవారం మంథని మండలంలోని ఎక్లాస్ పూర్, నెల్లిపల్లి,సూరయ్యపల్లి గ్రామాల్లో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్య మరియ గర్భంలో ఏసుక్రీస్తు జన్మించి తన పవిత్రతను చాటుకున్నాడని, నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనే క్రీస్తు బోధనలు అందరూ ఆచరించ దాగినవన్నారు.క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీయోను ప్రార్థన మందిరం పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయరాజు, కలువల శామ్యూల్, గద్దల రాజేష్, సంఘ పెద్దలు ఎం కే జోసెఫ్, మంథని ప్రసాద్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, అందె రమేష్, ఈర్ల సదానందం, అడిచర్ల కరుణాకర్, నాగరాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## లెదర్ పరిశ్రమల పునరుద్ధరణ చేయాలి....



**తొలి అక్షరం/ముషీరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో లెదర్ పరిశ్రమల పునరుద్ధరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించడం పై తెలంగాణ చర్మకారుల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ నేతృత్వంలో హోటల్ దసపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి లీడ్ క్యాప్ ను పునర్ధించి ప్రత్యేక చైర్మన్ డైరెక్టర్లు లను నియమించాలని కోరుతూ మెమోరండం అందజేశారు. అనంతరం ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో ప్రకటించిన రెండు లెదర్ పార్కులను వెంటనే ప్రారంభించాలని కోరారు. లిడ్ క్యాప్ ను పునర్ధించి దానికి ప్రత్యేక చైర్మన్ డైరెక్టర్లు లను నియమించి 12 వేల కోట్ల బడ్జెట్ను కేటాయించాలని విజ్ఞప్తి వేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లెదర్ పార్కులను ప్రారంభించి మాస్టర్ ట్రైనింగ్ చేసిన ఆర్టిజన్స్ కి మాదిగ నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్థిక అభివృద్ధి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొలుగు రాజు, డాక్టర్ చీమ శ్రీనివాస్, వెంకటయ్య, హనుమంత, సాయిబాబా, రాంబాబు, నరసయ్య, జాన్ దర్శనం, గుమ్మడి సతీష్, జంగా సుదర్శన్, మాస్టర్ మాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్‌ను కలిసి నల్లబెల్లి నూతన ఎస్ఐ

**తొలి అక్షరం/నర్సంపేట, డిసెంబర్ 16:** నల్లబెల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్.ఐ గా బాధ్యతలు చేపట్టిన వి. గోవర్ధన్ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ, నీతి, నిజాయితీతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.ఐ కి సూచించారు.



# శాసనమండలిలో తన గళం విప్పిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రశ్నల దాడిని సంధించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- ఆశా వర్కర్లకు ఇస్తామన్న 18 వేల రూపాయల జీతం ఎక్కడ అని ప్రశ్న
- ఆశా వర్కర్లపై దాడి చేసిన పోలీసులపై చర్యలు ఏవి?
- గురుకుల పాఠశాల వసతి గృహాల పరిస్థితి మరీ దారుణం
- వసతి గృహాల్లో ఎన్నో మరణాలు మనం చూస్తున్నాం
- ప్రభుత్వం సరైన భోజన సదుపాయం కల్పిస్తే ఇలా ఎందుకు జరుగుతుంది




**తొలి అక్షరం/షాద్ నగర్,డిసెంబర్15:** క్రింది స్థాయి నుండి కష్టపడి పనిచేసి, కరోనా కష్టకాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఎంతో మందికి సేవలు అందించిన ఆశా వర్కర్ల పై పోలీసుల దాడి హేయమని ఇప్పటివరకు ఆ పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని శాసనమండలి సమావేశంలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 18 వేల రూపాయల జీతం పెంపు హామీని నమ్మి, కాంగ్రెస్ కు ఓట్లు వేసి గెలిపించి ఒక సంవత్సరం పాటు ఆశ వర్కర్లు ఎదురు చూసి, తమ గోడు విన్నవించుకుందామని తమపై అధికారి వద్దకు వెళితే దాడి చేసిన పోలీసులను ఇప్పటివరకు ప్రభుత్వం సస్పెండ్ ఎందుకు చేయలేదంటూ ప్రశ్నించారు. ఎంతోమందికి సేవ చేసిన ఆశ వర్కర్లను గుర్తించి ఈరోజు జరగనున్న క్యాబినెట్ సమావేశంలో మీరు ఇచ్చిన మాట ప్రకారం, మాటకు కట్టుబడి వాళ్ల జీతం పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల వసతి గృహాల పరిస్థితులపై ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ గురుకుల పాఠశాల వసతి గృహాల పరిస్థితి మరీ దారుణంగా ఉందని, ఎంతమంది పిల్లలు చనిపోతున్నారని, ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోతలేదని, సరైన భోజన సదుపాయం కల్పిస్తే పాఠశాలల్లో ఇలా ఎందుకు జరుగుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవంటూ, విద్యా వ్యవస్థ పై ప్రభుత్వ పనితీరును సంవత్సరం కాలంగా గమనిస్తున్నామని, ఇలాగే జరిగితే గవర్నమెంట్ స్కూలు తీసివేయబడతాయని, ఇప్పటికే గవర్నమెంట్ స్కూలు తీసివేయబడుతున్నాయని ప్రభుత్వం తీసుకునే చర్యలు సభాముఖంగా తెలియజేయాలని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను భర్తీ చేయాలని, సంవత్సర కాలంగా ఎన్నో స్కూల్లో ఖాళీలు ఉన్నాయని వాటన్నింటిని గమనిస్తున్నామని, పాఠ్యాంశాల బోధనకు సంబంధించి వివిధ సబ్జెక్టులకు అసలు ఉపాధ్యాయులు ఉన్నారా లేరా అన్న విషయాన్ని ప్రభుత్వం గమనించడం లేదని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలపై మాకు ఎంతో గౌరవం ఉందంటూ, మరి వారిపై ప్రభుత్వానికి ఎంత గౌరవం ఉందో తెలియజేయాలని ఈ సందర్భంగా శాసనమండలిలో మంత్రులను ప్రశ్నించారు. ఇంకా శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ పట్టణంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరో మహాసభలకు తాను హాజరైనట్టు ఆ మహాసభలో తాను ఉపాధ్యాయుల సమస్యలను విన్నానని, సమస్యల పరిష్కారం కాకుంటే వారికి సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు తాను పూర్తిగా మద్దతు ఇస్తానని ఈ సందర్భంగా శాసనమండలిలో తెలిపారు.

# బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు

- కాంగ్రెస్ పాలనలో ఒక్కరూపాయి కూడా ఇవ్వడం లేదు
- కాంగ్రెస్ నిర్లక్ష్యంతో కుంటుపడుతున్న గ్రామాలు, పట్టణాలు
- చిన్నచిన్న బిల్లులు చెల్లించటానికి కూడా కాంగ్రెస్ పేచీ : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** బీఆర్ఎస్ పాలనలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టి ప్రతి నెల గ్రామాలకు 275 కోట్లు, పట్టణాలకు 150 కోట్లు ఇచ్చామని మాజీ మంత్రి తన్నీరుహరీశ్‌రావు అన్నారు. కానీ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వడం లేదని విమర్శించారు. గ్రామపంచాయతీలను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేయడంతో తెలంగాణ పల్లెలకు పోతే చికన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని అమెరికా తన పౌరులను హెచ్చరించే స్థాయికి పరిస్థితి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనినిబట్టి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు తెలిసిపోతున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో భాగంగా సర్పంచులకు పెండింగ్ బిల్లులపై హరీశ్‌రావు ప్రశ్నలేవనెత్తారు. దీనికిగాను మంత్రి సీతక్క సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులు రూ.691 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దీనిపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారు, కానీ చిన్న కాంట్రాక్టర్లకు సంవత్సరకాలం నుంచి 691 కోట్లు నిధులు ఇవ్వకుండా సర్పంచులు, ఎంపీటీసీలను ప్రభుత్వం గోస పెడుతున్నదని విమర్శించారు. చివరికి వారు గవర్నర్, మంత్రులను కలిసి మొరపెట్టుకున్నారని అయినా లాభం లేదని చలో అసెంబ్లీకి పిలుపునిస్తే వారిని అరెస్టు చేస్తున్నారని చెప్పారు. ‘బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ పల్లెలు అద్భుతంగా కేసీఆర్ నాయకత్వంలో తీర్చిదిద్దబడ్డాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం పెట్టి ప్రతి నెల గ్రామాలకు 275 కోట్లు, పట్టణాలకు 150 కోట్లు ఇచ్చాం. కానీ కాంగ్రెస్‌ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో పల్లె, పట్టణ ప్రగతి కింద ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వకపోవడంతో ఈ సమస్య వచ్చింది. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉత్తమ గ్రామ పంచాయతీయల అవార్డులను ప్రకటిస్తే వాటిలో టాప్ 20లో 19 తెలంగాణ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఘనత కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఆ రకంగా పల్లెలలను చేశాం. ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టరు, ట్యాంకరు, ట్రాలీ, నర్సరీ, డంప్‌యార్డ్, వైకుంఠధామం పెట్టి తెలంగాణ పల్లెలను దేశానికి ఆదర్శంగా నిలిపాం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్ఎఫ్‌సీ నిధులు విడుదల కావడం లేదు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఈజీఎస్ నిధులు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను దారిమళ్లించారు. జీపీ జనరల్ ఫండ్స్.. వాళ్ల డబ్బులు వాళ్లు ఖర్చుపెట్టుకోవడానికి ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో చెక్కులు పాసవకపోవడంతో నేడు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. అప్పులు చేసి, బంగారం కుదవపెట్టి పనిచేస్తే బిల్లులు ఇవ్వరా?.ఒక్క నవంబర్ నెలలో బడా కాంట్రాక్టర్లకు రూ.1200 కోట్ల బిల్లులు ఇచ్చారు. రూ.5 లక్షలు, రూ.10 లక్షల పనులు చేసిన చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల బిల్లులను చెల్లించకుండా పగబట్టి, కక్షతో వారిని ఇబ్బంది పెడుతున్నారు. గ్రామ పంచాయతీలకు క్రమంతప్పకుండా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకపోవడంతో తెలంగాణకు పోతే చికన్‌గున్యా వ్యాధులు వస్తున్నాయని అమెరికా తన పౌరులను హెచ్చరించే స్థితికి పరిస్థితి తీసుకొచ్చారు. దీనిని బట్టి పల్లెలను కాంగ్రెస్ సర్కార్ ఏవిధంగా నిర్లక్ష్యం చేసిందో అర్థమవుతుంది. ఇది మన రాష్ట్రానికే కాదు, మన దేశానికే అవమానం. మీ పాలన ఈ విధంగా ఉన్నది. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు దిగిపోయి తొమ్మిది నెలలైనా ఇంకా వారికి జీతాలు చెల్లించలేదు. ఒకటో తేదీన జీతాలిస్తున్నమని గొప్పగా చెబుతరు.. కానీ జెడ్పీ చైర్మెన్లకు జెడ్పీటీసీలు, ఎంపీటీలకు ఇంప్పటికీ వారికి మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. వారికి స్పష్టమైన తేదీ చెప్పాలి. పంచాయతీ ఎన్నికలలోపు వారికి జీతాలు చెల్లించాలి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రాజీవ్‌గాంధీ తెచ్చిన 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం, గ్రామపంచాయతీలను బలోపేతం చేస్తామన్నరు. క్రమంతప్పకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. మాజీ సర్పంచులు, జెడ్పీటీసీలకు పింఛన్లు ఇస్తామన్నరు. అవేమీ చేయకుండా కనీసం జీతాలు కూడా ఇస్తాలేరు. వారి జీతాలు, పెండింగ్ నిధులను ఎప్పటిలోగా క్లియర్ చేస్తరో స్పష్టంగా చెప్పాలని’ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, సర్పంచుల పెండింగ్ బిలులపై ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు.

# మేడారం ఆలయాలకు మహర్దశ

- అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయింపు
- నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.92 కోట్లు మంజూరు
- పునర్నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తి
- 2026లో జరిగే మహాజాతర నాటికి పనులు పూర్తి

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** మేడారం సమ్మక్క, సారలమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. 2026లో జరిగే మహాజాతర నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులు పట్టుదలగా ఉన్నారు. ఈ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.1.92 కోట్లు మంజూరు చేసింది. దీంతో పనులు వేగంగా జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. 1971లో దేవాదాయశాఖ వనదేవతలిద్దరికీ ఆలయాలు నిర్మించింది. అవి చిన్నగా ఉండటం, ప్రస్తుతం భక్తుల రాక పెరగడంతో పూజా కార్యక్రమాలకు ఇబ్బందిగా మారింది. దీంతో నూతన నిర్మాణాలు చేపట్టాలని పూజారులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. దీనిపై దృష్టిసారించిన దేవాదాయశాఖ.. ఈ ఏడాది మహాజాతర ముగిసిన తర్వాత మార్చిలో ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో.. నవంబరులో రూ.1.92 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నెల 12న టెండరు ప్రక్రియ ముగిసింది. త్వరలోనే పనులు ప్రారంభించి మహాజాతర కంటే ముందే నిర్మాణం పూర్తి చేస్తామని.. మేడారం ఆలయ కార్యనిర్వహణాధికారి స్పష్టం చేశారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర.. దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. రెండేళ్లకోసారి జరిగే ఈ వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. గతంలో కేవలం జాతర సమయంలోనే భక్తులు వచ్చేవారు. గద్దెల ప్రాంగణం వద్ద ఎలాంటి మార్పులు చేయకపోవడంతో.. జాతర సమయంలో భక్తుల నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్పటికే మేడారం వెళ్లే రహదారుల అభివృద్ధికి రూ.17.50 కోట్లు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలకు రూ.3.50 కోట్లు మంజూరు చేసి.. పనులు చేపట్టారు. తాజాగా.. వనదేవతల గద్దెల ప్రాంగణంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందినట్లు అధికారులు చెబుతున్నారు. సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొనేందుకు పస్రా, చింతల్, కొండాయి, తాడ్వాయి మీదుగా మేడారంలో ప్రవేశించి.. గద్దెల ప్రాంగణానికి చేరుకొనేందుకు వీలుగా రోడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

# అసెంబ్లీ జరుగుతున్నప్పుడు విధాన ప్రకటనలా

- భట్టి ప్రకటనలపై కెటిఆర్ అభ్యంతరం



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్16:** అసెంబ్లీ జరిగే సమయంలో విధాన పరమైన ప్రకటనలు అసెంబ్లీ ఆవరణలో చేయొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ లాబీ వద్ద చిట్ చాట్ లో కేటీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ జరిగే సమయంలో విధాన పరమైన ప్రకటనలు బయట చేయొద్దని తెలిపారు. అసెంబ్లీ సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై బయట మాట్లాడారని తెలిపారు. ఇది ఎంత వరకు సబబు అని స్పీకర్ ను ప్రశ్నించామన్నారు. వారు చేస్తే తప్పుకాదు.. అదేపని మేము చేస్తే తప్పా? అని ప్రశ్నించారు. ప్లే కార్డులు తేవద్దు అంటున్నారని మండిపడ్డారు. ఫోటోలు తీయొద్దు అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే లకు ప్రవేశం లేదు అంటున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు మొత్తం ఇక్కడే తిరిగేవారని కేటీఆర్ గుర్తుచేశారు. 2009-14 వరకు అసెంబ్లీలో తప్పుదోవ పట్టిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ ప్రివిలేజ్ మోషన్ ఇచ్చాము. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మీద జరుగుతున్న పరాజితం.. ఒడిపోయాన కాంగ్రెస్ అభ్యర్థులను వేదికలపై కూర్చోబెడుతున్నారని మండిపడ్డారుద. దీనిపై చర్య తీసుకోవాలని కోరామన్నారు. లాగచర్ల రైతుల అంశంపై చర్చకు అవకాశం ఇవ్వాలని కోరామని తెలిపారు. అప్పుల విషయంలో తప్పులు చెబుతున్నారని మండిపడ్డారు. ఆర్బీఐ రూ.3 లక్షల 90 వేలా కోట్లు అంటే, ప్రభుత్వమెమో రూ.6 లక్షల 90 వేలా కోట్లు అంటున్నారని , ఇది తప్పన్నారు. దీనిపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చామన్నారు. ఇది కూడా సభలో చర్చకు అనుమతి ఇవ్వాలని కోరామని చిట్ చాట్ లో కేటీఆర్ వివరించారు.